క్లుప్తంగా

నేడు కొల్లిపరలో పసుపు సాగుపై శిక్షణ

కొల్లిపర(తెనాలి): జాతీయ సుస్థిర సుగంధ ద్రవ్యాల శిక్షణలో భాగంగా మండల కేంద్ర మైన కొల్లిపరలో గల శ్రేష్ఠ రైతు ఉత్పత్తిదారుల సహకారం సంఘం (శ్రేష్ఠ ఎఫ్‌పీసీ) ఆధ్వర్యం లో శుక్రవారం పసుపు పంట సాగుపై శిక్షణ ఏర్పాటుచేశారు. శ్రేష్ఠ ఎఫ్‌పీసీలో ఉదయం 10 గంటలకు ఆరంభిస్తున్నట్లు డైరెక్టర్ వుయ్యూరు సాంబిరెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎన్ ఎస్ఎస్‌పీ మాస్టర్ ట్రైనర్లు కె.రామచంద్రన్, కె.సాయిబాబు, సుగంధ ద్రవ్యాల బోర్డు ప్రతినిధి, ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులు, కృషిఖాన్ ఎక్స్‌పోర్ట్స్ సంస్థ ప్రతినిధి ఎం.వంశీ, ఎఫ్ఐబీ.ఎస్‌ట1 సేంద్రియ ఉత్పత్తిదారుల ప్రతినిధులు పాల్గొంటారని వివరించారు. రైతులు, సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైలు ప్రయాణాల్లో జాగ్రత్తలపై అవగాహన



తెనాలిరూరల్: రైలు ప్రయాణాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైల్వే అధికారులు విద్యార్థులకు వివరించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా వివేకానంద సెంట్రల్ స్కూలు విద్యార్థులు గురువారం తెనాలి రైల్వే స్టేషన్‌కు వెళ్లారు. రైల్వే అధికారులు పనితీరు, రైళ్ల రాకపోకల సందర్భంలో అధికారులు తీసుకునే చర్యలు వంటివి పరిశీలించారు. ప్రయాణాలు చేసేప్పుడు ఎటువంటి జాగ్రత్తలు పాటించాలో అధికారులు చిన్నారులకు వివరించారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రావడంతో విద్యార్థులను రైల్లోకి ఎక్కించి చూపించారు. రైళ్లలో బాణాసంచా ఇతర పేలుడు పదార్థాలు తీసుకెళ్లకూడదని, పట్టుబడితే జైలు శిక్ష తప్పదని విద్యార్థులతో పాటు ప్రయాణికులకు తెలిపారు. ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ ఎం. శివరామకృష్ణయ్య, స్టేషన్ మేనేజర్ టీవీ రమణ, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ అవగాహన కల్పించారు.

నృత్య కళాకారిణులకు సినీ నటుడు సుమన్ సత్కారం



తెనాలిఅర్బన్: తెనాలికి చెందిన బాల నృత్య కళాకారులు గ్రీష్మ శ్రీ, తహసీన్‌లను సినీ నటుడు సుమన్ ఘనంగా సత్కరించారు. తాడేపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ చాంబర్ నూతన భవన ప్రారంభోత్సవానికి గురువారం వచ్చిన ఆయన వీరి నృత్య ప్రదర్శనను చూశారు. అనంతరం వారిని సన్మానించి అభినందించారు.

16న చైర్మన్ ఎన్నిక

తెనాలిరూరల్: పట్టణ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక ఈనెల 16వ తేదీన నిర్వహించనున్నారు. మున్సిపల్ చైర్మన్‌ల ఎన్నిక నిర్వహించాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేయడంతో తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మను ఎన్నికల అధికారిగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారని మున్సిపల్ కమిషనర్ ఎం. జస్వంతరావు గురువారం తెలిపారు. 16వ తేదీన చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారని చెప్పారు. 16న జరిగే సమావేశంలో నూతన చైర్మన్‌ను ఎన్నుకొంటారన్నారు. ప్రస్తుతం 7వ వార్డు కౌన్సిలర్ మాలేపాటి హరిప్రసాద్ ఇన్‌చార్జి చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు.

నిందితుల అరెస్ట్

తెనాలిరూరల్: చోరీ కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నెల 5వ తేదీన రాత్రి తెనాలి మారీసుపేట కొత్తవంతెన డౌన్‌లోని ఓ దుకాణం తాళాలు పగులగొట్టిన దుండగులు అందులోని నగదు, సిగరెట్ పెట్టెలు అపహరించుకెళ్లారు. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేయగా ఏఎస్ఐ హైదర్ అలీ నిందితులను మారీసుపేట సీఎం కాలనీకి చెందిన నాగూర్, అన్నవరం సత్యనారాయణలుగా గుర్తించి గురువారం అరెస్ట్ చేశారు.

గోల్డెన్ అవర్ చాలా ముఖ్యం

తెనాలి: గుండెపోటు సంభవించిన మొదటి గంట వ్యవధిలో తగిన చర్యలు తీసుకుంటే రోగి జీవితాన్ని కాపాడవచ్చు...గుండె కండరాలకు నష్టం జరగకుండా నివారించేందుకు వీలుంటుంది సరైన అవగాహన లేకపోవటం, నేటి న్యూక్లియర్ కుటుంబాల్లో సాయపడే మనిషి లేక ఆసుపత్రికి తీసుకెళ్లటంలో జాప్యం జరుగుతోంది. గుండెపోటు మరణాల్లో 47 శాతం ఆసుపత్రికి తీసుకెళ్లేలోగానే సంభవిస్తున్నాయనే గణాంకాలు ఉన్నాయి. అందుచేతనే తొలి గంటను గోల్డెన్ అవర్‌గా వ్యవహరిస్తున్నారు. తెనాలి పట్టణ మహిళల్లో క్యాన్సర్ నివారణలో కృషిచేస్తున్న డీ3 శారద సర్వీస్ సొసైటీ గోల్డెన్ అవర్‌లో వైద్యసేవలకు సంసిద్ధమైంది. 'ధర్మ' ప్రాజెక్టు పేరుతో ఇందుకు అంకురార్పణ చేశారు. గురువారం సాయంత్రం వహాబ్‌చౌక్ రోడ్లోని హాస్పటల్‌లో ఏర్పాటైన సన్నాహక సభకు రొటేరియన్ గుత్తా వెంకటరత్నం అధ్యక్షత వహించారు. సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ శారద మాట్లాడుతూ కొన్నేళ్ల క్రితం తన తండ్రికి గుండెపోటు సంభవించినపుడు తొలి గంటలో తగిన వైద్యం అందుకోలేని నిస్సహాయ పరిస్థితి, 'ధర్మ' ప్రాజెక్టుకు ప్రేరణగా చెప్పారు.

సుపరిపాలన కోసం జగనే కావాలి

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- అంగలకుదురులో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం

తెనాలిరూరల్: కులమతాలకు అతీతంగా రాష్ట్రంలో అన్ని వర్గాలకు సమ న్యాయం జరిగే సుపరిపాలన అందించడం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ద్వారానే సాధ్యమని, ఆంధ్ర ప్రదేశ్‌కు జగనన్న అందుకే కావాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో తెనాలి మండలం అంగలకుదురు గ్రామంలో గ్రామ సచివాలయం-1 పరిధిలో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ 2019లో అధికారంలోకి వచ్చిన నాటి నుండి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యతనిస్తూ సుపరిపాలనను అందిస్తున్నారని చెప్పారు. ఎక్కడా దళారీలు, అవినీతి లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ లబ్ధిని చేకూరుస్తున్నారని తెలిపారు. ఒక్క అంగలకుదురు గ్రామంలోనే 2019లో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు వివిధ సంక్షేమ పథకాల కింద రూ. 27,23,28,477 ప్రజల ఖాతాల్లో నేరుగా జమ చేసినట్టు తెలిపారు. అమ్మఒడి పథకం కింది 354 కుటుంబాలకు రూ.1,56, 04,000 ప్రభుత్వం అందించిందన్నారు. విద్యా దీవెన కింది 203 కుటుంబాలకు రూ. 2,21,27,500 చెల్లించాలమన్నారు. గత ప్రభుత్వంలో 840 మందికి మాత్రమే పింఛన్లు ఇచ్చేవారని, తాము అధికారంలోకి వచ్చాక అర్హులందరినీ గుర్తించి ప్రస్తుతం 1135 మందికి ఇస్తున్నట్టు తెలిపారు. సంక్షేమ పథకాలతో పాటు కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. వెల్‌నెస్ సెంటర్, ఆర్‌బీకే భవనం, సచివాలయాలు, రోడ్లు, చెరువు అభివృద్ధి వంటి కార్యక్రమాలకు రూ. ఐదు కోట్లు కేటాయించి పనులు పూర్తి చేసినట్లు వివరించారు.

'నాడు-నేడు' పథకం కింద..

'నాడు-నేడు' పథకం కింద గ్రామంలోని జెడ్పీ హైస్కూలు రూ. 1.12 కోట్లు కేటాయించి అభివృద్ధి చేశామని అలానే మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు రూ. 11 లక్షలు కేటాయించామన్నారు. నివేశన స్థలాల విషయంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన వినతులను పరిశీలించి రెండో విడతలో ఇవ్వనున్నామని చెప్పారు. ఈబీసీ నేస్తం పథకం ప్రవేశ పెట్టి అగ్రకులాల్లోని పేదలకు ఆర్థిక భరోసా ఇచ్చింది కేవలం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని తెలిపారు. ప్రతి కుటుంబానికి సంక్షేమం అందించాలన్న చిత్తశుద్ధితో ముఖ్యమంత్రి పని చేస్తున్నారని చెప్పారు. 2019 ఎన్నికలకు ముందు తాము ప్రవేశపెట్టే సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తే ప్రజలు ఆదరించి వైఎస్సార్ సీపీకి 151 ఎమ్మెల్యే సీట్లు అందించారని, ప్రజల ఆదరణను నిలబెట్టుకునేలా పారదర్శకంగా పాలన సాగుతోందన్నారు. సమగ్ర భూ సర్వేతో భూ వివాదాలు పరిష్కారమవుతాయని తెలిపారు.

అంగలకుదురు గ్రామంలో తనకు మెజారిటీ రాకపోయినా రాజకీయాలకతీతంగా గ్రామంలో అభివృద్ధి సంక్షేమానికి పెద్ద పీట వేసినట్టు తెలిపారు. అన్ని వర్గాలకు జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సమ న్యాయం జరుగుతోందని శివకుమార్ అన్నారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి చివాలయం పరిధిలో పలు ఇళ్లకు వెళ్లి ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కరపత్రాన్ని గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, ప్రస్తుత ప్రభుత్వం అమలు చేసిన హామీలతో కూడిన కరపత్రాన్ని అందించి పథకాల గురించి వివరించారు. ఇన్‌చార్జి ఎంపీపీ గోపిశెట్టి రమాదేవి, జెడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతి, ఎంపీటీసీ ముప్పవరపు సంధ్యారాణి, గ్రామ కన్వీనర్ బండి హైమారావు, కడియాల సురేష్, ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రతాపరెడ్డి, గ్రామ కార్యదర్శి గుర్రం ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కిఆసు కిరణ్‌కుమార్, బూరెల దుర్గ తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తుల ఇళ్లకు వెళ్లి పథకాలను వివరించడంతో పాటు కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్



మాట్లాడుతున్న వైస్‌చైర్మన్ నాగవేణి

తెనాలి ఒకటోవ వార్డులో ..

తెనాలిఅర్బన్: రాష్ట్ర అభివృద్ధిలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చెరగని ముద్ర వేశారని మున్సిపల్ వైస్‌చైర్మన్ అత్తోట నాగవేణి పేర్కొన్నారు. వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం లింగారావు సెంటర్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ అధికారంలోకి వచ్చిన తొలి రోజులోనే అమలు చేశారని గుర్తు చేశారు. జగన్ ప్రకటించిన మ్యానిఫెస్టోలోని అన్ని అంశాలు అమలు చేయడంతో పాటు అదనంగా మరి కొన్ని అమలు చేయడం జరిగిందన్నారు. నవరత్న పథకాల ద్వారా అనేక మంది ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలు అగ్రవర్ణాల్లోని పేదలకు సంక్షేమ పథకాలు అందించినట్లు చెప్పారు. ఒక్కో వార్డులో సుమారుల 20 నుంచి 30 కోట్లకు పైగా సంక్షేమ పథకాలు అందించినట్లు వివరించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు, స్పెషల్ ఆఫీసర్ కె.గాయత్రీ దేవిలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి కృషి చేస్తుందని చెప్పారు. వివిధ పథకాల ద్వారా అనేక మంది లబ్ధి పొందారని గుర్తు చేశారు. ఎవరికైనా అర్హత ఉండి పథకాలు రాకపోతే తమను సంప్రదించాలని సూచించారు. ఒకటోవ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గెడ్డేటి సురేంద్ర మాట్లాడుతూ సంక్షేమ సారధి సీఎం జగన్ అని కొనియాడారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలన్నా, సంక్షేమ పథకాలు విస్తృతంగా కొనసాగాలన్నా 2024 ఎన్నికల్లో మరలా వైఎస్సార్‌సీపీకి అధికారం ఇవ్వాలని కోరారు. ఒకటోవ వార్డులో రూ.24 కోట్లతో సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు చెప్పారు. అనంతరం సచివాలయంలో ఏర్పాటు చేసిన లబ్ధిదారుల వివరాల బోర్డులను వారు ఆవిష్కరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మద్దాలి శేషాచలం, వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమ తెనాలి పట్టణ జాయింట్ కన్వీనర్ తిరుమలశెట్టి శ్రీనివాసరావు, మేనేజర్ అప్పలరాజు, సచివాలయ ఉద్యోగులు, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు.



బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

తెనాలిఅర్బన్: డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 10.30 నుంచి 11.30 వరకు నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ సేవల్లో కలిగే ఇబ్బందులు, బస్సు సర్వీసులపై సూచనలు, సలహాలు, ఫిర్యాదులు తెలియజేయవచ్చని చెప్పారు. ఫోన్ నెంబర్ 9959225422 లో సంప్రదించాలని కోరారు.

నేడు జైభీమ్ ఫెడరేషన్ వ్యవస్థాపక దినోత్సవం

తెనాలిటౌన్: జై భీమ్ ఫెడరేషన్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు బస్టాండ్ సమీపంలోని సామ్రాట్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహిస్తున్నట్లు జెబిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొవిరపు దేవానంద్ (దేవయ్య) గురువారం తెలిపారు. వేడుకల్లో సభకు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అధ్యక్షత వహిస్తారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర హోంశాఖమంత్రి తానేటి వనిత, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు జూపూడి ప్రభాకరరావులు పాల్గొంటారని దేవయ్య, వైస్ ప్రెసిడెంట్ బేతాళ భూషణంలో తెలిపారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన సదస్సు

తెనాలిటౌన్: ఆశ కార్యకర్తలుకు కుష్ఠు వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని, కొత్త కేసులను గుర్తించి ఆరోగ్య సిబ్బందికి సహాయపడాలని లెప్రో ప్రాజెక్ట్ అసోసియేట్ వహీద్ బాషా కోరారు. రూరల్ మండలం సంగంజాగర్లమూడిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆశ కార్యకర్తలకు కుష్ఠు వ్యాధిపై అవగాహనా సదస్సు నిర్వహించారు. సదస్సులో లెప్రో సొసైటీ రాష్ట్ర సమన్వయ కర్త రాధిక మాట్లాడుతూ సంస్థ ద్వారా తెనాలి మండలంలో కుష్ఠు వ్యాధిగ్రస్తులకు స్వయం సంరక్షణ శిబిరం నిర్వహించి వారికి అవసరమైన పాదరక్షలు, అల్సర్ కిట్లు ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. వ్యాధి లక్షణాలు, చికిత్స, వ్యాధి నిర్మూలనలో ఆశ కార్యకర్తల పాత్ర గురించి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ హనీఫ్ వివరించారు. కార్యక్రమంలో రమణయ్య, బసవకుమారి, లక్ష్మీకుమారి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తుల మనోభావాలకు అనుగుణంగా ముందుకుసాగండి

- ఆలయ పవిత్రతను కాపాడండి
- ఎమ్మెల్యే శివకుమార్ సూచన
- ప్రమాణస్వీకారం చేసిన వైకుంఠపురం దేవస్థానం నూతన ట్రస్ట్‌బోర్డు

తెనాలి: సామాజిక సమతౌల్యం పాటిస్తూ నియమించిన వైకుంఠపురం ఆలయ నూతన ట్రస్ట్‌బోర్డు భక్తుల మనోభావాల కనుగుణంగా ఆలయ పవిత్రతను కాపాడుతూ, వారికి తగిన వసతుల కల్పనకు కృషిచేయాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. తెనాలి వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీసమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు ప్రమాణ స్వీకారోత్సవం గురువారం మధ్యాహ్నం ఘనంగా నిర్వహించారు. సభకు ఎమ్మెల్యే శివకుమార్ అధ్యక్షత వహించారు. ముందుగా ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి ఎం.తిమ్మానాయుడు, ట్రస్ట్‌బోర్డ్ చైర్మన్‌గా కుంభం సాయిబాబు, సభ్యులుగా కనికిచర్ల చరణ రత్న సందీప్, వంగల జగదీశ్వరి, కురగంటి సునీత, బొద్దులూరి సరస్వతి, మావులూరి శ్రీనివాస్, ముంతా దుర్గాప్రసాద్, బట్టు దుర్గారావు, దేవరకొండ వెంకటరమణ, ఎక్స్‌అఫీషియో సభ్యుడు అళహరి రవికుమార్‌చే ప్రమాణం చేయించారు. ఎమ్మెల్యే శివకుమార్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ వెంకటేశ్వరుడికి సేవలతోపాటు భక్తుల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చాలని సభ్యులను కోరారు.

ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కుంభం సాయిబాబు మాట్లాడుతూ ఆలయ వ్యవస్థాపకుడు బాల నరసింహారావుగౌడ్ 1972లో ప్రతిష్టించిన ఆలయానికి, ఎమ్మెల్యే శివకుమార్ చొరవతో ఇంతకాలానికి గౌడ సంఘీయుడైన తనకు చైర్మన్‌గా అవకాశం లభించిందన్నారు. శ్రీవేంకటేశ్వరస్వామి భక్తుడిగా తనకు లభించిన అదృష్టాన్ని బాధ్యతలా భావించి ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని అన్నారు. సభ్యులు బట్టు దుర్గారావు, ముంతా దుర్గాప్రసాద్, కురగంటి సునీత, దేవరకొండ వెంకటరమణలు కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ వార్డు ఇన్‌చార్జి కాళిదాసు సత్యం, అద్దంకి వేణుగోపాల్ మాట్లాడారు. పోతావఝుల పురుషోత్తమశర్మ స్వాగతం పలికిన సభలో వైఎస్సార్ సీపీ పట్టణ-1 అధ్యక్షుడు మద్దాళి శేషాచలం, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే చిరంజీవి, బట్టు నాగేశ్వరరావు, దేవరకొండ శంకర్, లక్కరాజు లక్ష్మణరావు, గొట్టిముక్కల కాశీ, పార్టీ నేతలు బూరెల దుర్గాప్రసాద్, కొలకలూరి నాగేశ్వరరావు, అక్కిదాసు కిరణ్, షేక్ మీరావలి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శివకుమార్ సమక్షంలో ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కుంభా సాయిబాబు, సభ్యులచే ప్రమాణం చేయిస్తున్న ఈవో తిమ్మానాయుడు

సేవా కార్యక్రమాల కోసం విక్రయాలు

తెనాలిఅర్బన్: జేఎంజే కళాశాల ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సిస్టర్ షైనీ పేర్కొన్నారు. కళాశాల ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినుల ఆధ్వర్యంలో డ్రస్సులు, చీరలు, టిఫిన్స్, బిర్యానీ, కూల్‌డ్రింక్స్ వంటి విక్రయ స్టాల్స్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వాటిని విక్రయించగా వచ్చిన నగదును కొండ్రముట్లలోని ట్రైబల్ స్కూల్స్‌కు విరాళం ఇవ్వడం జరుగుతుందన్నారు.

కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ థెరిస్సామ్మ, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ శారద, అధ్యాపకులు సిస్టర్ అమూల్ మేరి, డాక్టర్ అరుణ సుజాత, పాటిబండ్ల హేమలత, విమలాదేవి, మేరి కుమారి, అరుణ, తదితరులు పాల్గొన్నారు.



దుస్తులను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ షైనీ

వాహనదారులకు రూ. 70 వేల జరిమానా

తెనాలిరూరల్: సరైన పత్రాలు లేకుండా వాహనాలను నడుపుతున్న వారికి అధికారులు జరిమానా విధించారు. రవాణా శాఖ, ట్రాఫిక్ పోలీసుల సంస్థ ఆధ్వర్యంలో వాహన తనిఖీల ప్రత్యేక డ్రైవ్‌ను గురువారం సాయంత్రం నిర్వహించారు. చేబ్రోలు మండలం వడ్లమూడి వద్ద నిర్వహించిన తనిఖీల్లో ప్రాంతీయ రవాణ అధికారి కె.ప్రసాద్‌మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి. రాఘవరావు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌బీ మధుసూదనరావు, చేబ్రోలు పోలీసులు, సిబ్బందితో కలసి ద్వి చక్రవాహనాలను తనిఖీ చేశారు. అటుగా రాకపోకలు సాగిస్తున్న వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. సరైన పత్రాలు లేని 11 వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేశారు. వాహనదారులకు రూ.70 వేల జరిమానా విధించారు. వాహనదారులు అన్ని పత్రాలు కలిగి ఉండాలని, నిబంధనలను పాటించకపోతే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం

తెనాలిరూరల్: మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అర్హులందరికీ ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని దానిని సద్వినియోగ పరచుకోవాలని దుర్వినియోగం చేయకూడదని అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్ అన్నారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక కోర్టు ప్రాంగణంలో పారాలీగల్ వలంటీర్ యర్రంశెట్టి అనిల్‌కుమార్ పర్యవేక్షణలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి మాట్లాడుతూ, జాతి, మత, కుల, వర్గ, వర్ణ, లింగ బేధాలు లేకుండా అందరికి సమాంతర న్యాయం అందించాలనే ఉద్దేశ్యంతో సేవ చట్టాన్ని 1987వ సంవత్సరంలో ప్రవేశపెట్టారని తెలిపారు. కొన్ని ముఖ్య సవరణలు చేసుకుని 1995 నవంబరు 9వ తేదీ నుంచి దేశ వ్యాప్తంగా చట్టం అమలులోకి వచ్చిందన్నారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం జాతీయ న్యాయ సేవా దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలియజేశారు. న్యాయమూర్తులు పి.రాజశేఖర్, జె. శ్రీసీత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మండలపు వేణుగోపాలరావులు ప్రసంగించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు, పోలీసు అధికారులు, న్యాయ స్థానాల సిబ్బంది, పారాలీగల్ వలంటీర్లు, మండల న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది మహబూబ్, సరళ. విజయ్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీధర్

తెనాలి కోర్టులో విధులు ఆనందదాయకం

న్యాయమూర్తి జి.మాలతి

తెనాలిరూరల్: తెనాలి కోర్టులో విధులు నిర్వర్తించడం చాలా ఆనందదాయకంగా ఉందని, ఇక్కడి న్యాయవాదులు బెంచ్‌లకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తారని న్యాయమూర్తి జి.మాలతి పేర్కొన్నారు. గురువారం స్థానిక కోర్టు ప్రాంగణంలో తెనాలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బదిలీపై హైకోర్టుకు వెళుతున్న 11వ అదనపు జిల్లా న్యాయమూర్తికి ఘనంగా వీడ్కోలు, అభినందన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ గత రెండున్నరేళ్లలో కేసులు త్వరితగతిన పరిష్కారంలో న్యాయవాదులు అందించిన సహాయ సహకారాలు మరువలేనివన్నారు. అదే విధంగా లోక్ అదాలత్‌లకూ సహకరించి ఎక్కువ కేసులను డిస్పోజల్ చేసేందుకు సహకరించారని తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మండలపు వేణుగోపాలరావు మాట్లాడుతూ, న్యాయమూర్తి సేవలను కొనియాడారు. బెంచ్ అండ్ బార్ అనే పదానికి ఒక వివరణాత్మకమైన నిర్వచనాన్ని న్యాయమూర్తి ఇచ్చారన్నారు. అదే విధంగా బార్ అసోసియేషన్‌కు అవసరమైన ఎన్నో విలువైన అనుమతులు ఇప్పించడం, దగ్గరుండి వివిధ కార్యక్రమాలను నిరాటంకంగా జరిపించడంలో న్యాయమూర్తి అందించిన సహాయ సహకారాలు మరిచిపోలేనివని చెప్పారు. ఈ సందర్భంగా న్యాయమూర్తిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కంచర్ల చంద్రశేఖర్, కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



న్యాయమూర్తి మాలతిని సత్కరిస్తున్న వేణుగోపాలరావు, గౌరీశంకర్

మంత్రముగ్ధులను చేసిన గాత్ర యుగళం

తెనాలి: చెన్నైకు చెందిన 'సంగీత సహోదరిగళ్' కోట పూర్వధనశ్రీ-పావనిలు తమ గాత్రకచేరీతో సంగీతాభిమానులకు వీనులవిందు చేశారు. ఎదను కదిపే ఆలాపనతో ప్రేక్షకులు అలౌకిక ఆనందంతో తాదాత్మ్యం చెందారు. పట్టణానికి చెందిన ప్రఖ్యాత సంగీత సంస్థ సీతారామ గానసభ వార్షిక సంగీతోత్సవాలు ఇందుకు వేదికయ్యాయి. నాలుగో రోజైన గురువారం సాయంత్రం ఇక్కడి పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ఏర్పాటైన గాత్ర యుగళకచేరిలో కోట పూర్వధనశ్రీ-పావనిలు ప్రధానంగా సిద్ధి వినాయకం... కీర్తనను షణ్ముకప్రియ రాగంలో ఆలపించారు. దీక్షితార్ కీర్తన, త్యాగరాజస్వామి కీర్తనలను గానం చేసి ఆద్యంతం తమ గాత్రంతో శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. విశాఖపట్నంకు చెందిన వ్యాకరణం గాయత్రి విభావరి వయొలిన్‌పై, తెనాలికి చెందిన కేవీ రామకృష్ణ మృదంగంపై వాద్య సహకారం అందించారు.



గానాలాపన చేస్తున్న పూర్వధనశ్రీ-పావని

దీపావళిని పర్యావరణహితంగా జరుపుకోండి

తెనాలిఅర్బన్: దీపావళి పర్వదినాన్ని పర్యావరణానికి హానీకలగకుండా జరుపుకోవాలని సచివాలయ శానిటరీ సెక్రటరీలు ఆర్.నాగేశ్వరరావు, ఆర్.ప్రవీణ్‌కుమార్‌లు కోరారు. స్వచ్ఛభారత్‌మిషన్‌లో భాగంగా తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ స్కూల్‌లో పర్యావరణహిత దీపావళి గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కార్యదర్శులు పి.శాంతకుమారి, ఎం.శాంతి ప్రియదర్శిని, కె.సంధ్య, జి.ప్రవీణకుమారి, డి.సాగరయ్య, కె.సురేష్, కె.శ్రీనాథ్, వై.నాగమల్లేశ్వరరావు, జి.చంద్రశేఖర్, పాల్గొన్నారు.



కలసి పనిచేయమే సీపీఎం లక్ష్యం

తెనాలి: రాష్ట్రాభివృద్ధి కోసం బీజేపీ వ్యతిరేక శక్తులతో కలసి పనిచేయడమే లక్ష్యంగా సీపీఎం ముందుకు సాగుతోందని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే గఫూర్ చెప్పారు. ప్రజారక్షణ భేరి ప్రచారంలో భాగంగా చేపట్టిన బస్సు యాత్ర గురువారం తెనాలికి చేరుకుంది. మార్కెట్ సెంటర్లోని అన్నాబత్తుని పురవేదిక వద్ద జరిగిన బహిరంగ సభలో గఫూర్ మాట్లాడుతూ, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, ప్రజలకు మేలు జరగాలన్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలు మారాలని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.ఉమామహేశ్వరరావు, జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చింతర్వాత ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారని, తొమ్మిదేళ్లలో 18 కోట్ల ఉద్యోగాలు ఎక్కడని ప్రశ్నించారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు భాస్కరయ్య, రాష్ట్రనాయకులు దయా రమాదేవి, బి.శివనాగరాణి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భావన్నారాయణ, ములకా శివసాంబిరెడ్డి, షేక్ హుస్సేన్‌వలి, తెనాలి ఏరియా కార్యదర్శి కె.బాబూప్రసాద్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మంగళగిరి పద్మ, వెంకటేశ్వర్లు పాల్గొని ప్రసంగించారు.